జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఐసీసీ చైర్మన్‌గా జై షా..

రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక

న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజాజ్యోతి): అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్‌గా జై షా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండోసారి ఈ పదవికి ఆయన పేరును ఐసీసీ బోర్డు ఖరారు చేసింది. బాలి వేదికగా జరిగిన బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో జై షా

మిగతా 2లో..

వాయిస్ శాంపిల్స్ ఇవ్వండి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టు సూచన

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను దూషించారనే ఫిర్యాదుతో వీణవంక పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వాయిస్ శాంపిల్ ఇవ్వాలని పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ

మిగతా 2లో..


ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 17 నవంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 250 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

వరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: షష్ఠి - 26:02:52 వరకు నక్షత్రంఉత్తరాషాఢ - 23:29:28 వరకు కరణంకౌలవ - 12:45:43 వరకు, తైతిల - 26:02:52 వరకు వక్షంశుక్ల యోగంగణ్డ - నిండా రాత్రి వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

ఎన్నో అవాస్తవిక కథనాలు





మా కుటుంబంపై కథనాలు అల్లారు

అవాస్తవాలకు వాస్తవాలతో సమాధానం

కథనాల్ని తిప్పికొట్టడానికే 'బిలాంగింగ్

సోనియా గాంధీ కీలక విషయాలు వెల్లడి

సోనియా ఆత్మకథ బిలాంగింగ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తన జీవితంలోని అనుభవాలు వివరిస్తూ రచించిన ఆత్మకథ బిలాంగింగ్ ఎ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకాన్ని సోమవారం న్యూఢిల్లీలో అధికారికంగా ఆవిష్కరించారు. బయట తన కుటుంబం గురించి ఎన్నో అవాస్తవ కథనాలు ప్రచారంలో ఉన్నాయని, వాటికి వాస్తవాలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ పుస్తకాన్ని రాసినట్లు సోనియా గాంధీ వెల్లడించారు. నవంబర్ 10న మార్కెట్లోకి వచ్చిన ఈ పుస్తకం ఆరు రోజుల్లోనే 2 లక్షలకు పైగా కాపీలు అమ్ముడై, అత్యంత వేగంగా అమ్ముడైన పుస్తకాల జాబితాలో ఒకటిగా నిలిచింది. ఈ పుస్తకావిష్కరణ సందర్భంగా సోనియా గాంధీ మాట్లాడుతూ.. తన కుటుంబం గురించి, ముఖ్యంగా తన అత్త, భర్త, కుమారుడు, కుమార్తె, తన గురించి ఎన్నో విషయాలు ప్రచారంలో ఉన్నాయని.. వాటిలో చాలా వరకు అవాస్తవాలే ఉన్నాయని చెప్పుకొచ్చారు. తమ ఫ్యామిలీ చూట్టూ

మిగతా 2లో..

వరల్డ్ టాప్-200 వర్సిటీల్లో ఐఐటీ దిల్లీ

వరల్డ్ టాప్-500 లోకి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ



న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజాజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ప్రకటించిన 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టైనబులిటీ ర్యాంకింగ్స్ 2027' జాబితాలో భారతీయ విద్యాసంస్థలు సత్తా చాటాయి. ఈ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) దిల్లీ భారతదేశంలో అగ్రస్థానంలో నిలవగా ప్రపంచవ్యాప్తంగా 194వ ర్యాంకు సాధించి టాప్- 200లో చోటు సంపాదించింది. మరోవైపు

మిగతా 12లో..



బరోంగ్ తగలాగ్ దుస్తుల్లో మెరిసిన మోడీ

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో పర్యటన

న్యూఢిల్లీ, నవంబర్ 16(ప్రజాజ్యోతి): మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో పర్యటిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. సోమవారం ఆ దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్ ఏర్పాటు చేసిన గాలా డిన్నర్‌కు హాజరయ్యారు. ఈ విందులో ప్రధాని మోదీ ఫిలిప్పీన్స్ జాతీయ, సాంప్రదాయ అధికారిక పురుషుల వస్త్రధారణ అయిన బరోంగ్ తగలాగ్ దుస్తులను ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నావిగేటింగ్ ది ఫ్యూచర్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్న 49వ ఆసియాన్, అనుబంధ శిఖరాగ్ర సదస్సులకు హాజరైన వివిధ దేశాల అధినేతల గౌరవార్థం మనీలాలోని ఫిలిప్పీన్

మిగతా 2లో..

రాష్ట్రానికి అక్వాన్ తుపాను ముప్పు

తెలంగాణలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్.

పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

నవంబర్ 20న తీరాన్ని తాకే అవకాశం

నవంబర్ 20 నుంచి వర్షాలు కురిసే సూచన

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి 'అక్వాన్' తుపానుగా మారుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మిగతా 2లో..



గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విస్తరణ

పల్లెలకు ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం

'భారత్‌నెట్' ప్రాజెక్టు పనులు వేగవంతం

కేంద్రం, టి-ఫైబర్ మధ్య కీలక ఒప్పందం

3,185 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్

మిగతా 12లో..

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

అవినీతి జలగా మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్

ప్రభుత్వ అధికారి ఇంట్లో భారీగా అక్రమ ఆస్తులు..

ఏసీబీ సోదాల్లో విస్తుపోయే ఆస్తుల లెక్కలు!

6.76 కోట్ల అక్రమ ఆస్తులను గుర్తించిన అధికారులు



హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మొయినాబాద్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి గుండు వాణిపై కేసు నమోదు చేశారు. ఆమెకు తెలిసిన ఆదాయ వనరులతో పోలిస్తే అధికంగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో నవంబర్ 16, 2026న అధికారులు ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో స్థిర,

మిగతా 2లో..



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భారీ ఊరట

దశాబ్దకాలంగా పెండింగ్ సమస్యకు పరిష్కారం

పెట్టిన ఒరిజినల్ ఇంటి పట్టాలు తిరిగి అందజేత

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మందికి లబ్ధి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): తెలంగాణలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 2014కు ముందు వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు పొందిన లబ్ధిదారులకు తనఖాలో ఉన్న ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప, వాంబే పథకాల కింద ఇళ్లు పొందిన వారికి

మిగతా 12లో..

కార్తీక తొలి సోమవారం వైభవం..

శైవక్షేత్రాల్లో పోటెత్తిన భక్తులు

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా రాష్ట్రంలో పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈశ్వరుడిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. శివుడుకి ప్రత్యేక పూజలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. శైవక్షేత్రాలన్నీ

మిగతా 12లో..



సంపాదకీయం

ప్రమాదకరంగా హువాంగ్ చర్యలు

టెక్ ఇండస్ట్రీలో పెనుకలకలం రేగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చిప్‌ల రూపశిల్పి, ఎన్వీడీయా సీఈఓ జెన్సన్ హువాంగ్ చైనా గూఢచార సంస్థతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్లు అంగీకరించారు. ఈ విషయాన్ని ఆయన ఎన్వీడీయా ఉద్యోగులకు పంపిన ఒక అంతర్గత ఈ-మెయిల్ ద్వారా పేర్కొన్నారు. న్యూయార్క్ టైమ్స్, ఫైనాన్షియల్ టైమ్స్ నివేదికల ప్రకారం.. సింగపూర్ బేస్డ్ టెక్నాలజీ సంస్థ మెగాస్పీడ్ ఇంటర్నేషనల్ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అలైస్ హువాంగ్‌తో జెన్సన్ హువాంగ్‌కు సన్నిహిత సంబంధం ఏర్పడింది. అమెరికా నిఘా వర్గాలు సమాచారం ప్రకారం.. అలైస్ హువాంగ్ చైనా కోసం పనిచేస్తున్న ఒక గూఢచారి అని, ఆమె జెన్సన్ హువాంగ్ ద్వారా అమెరికన్ ఏఐ టెక్నాలజీ, ఎన్వీడీయా కంపెనీ వ్యాపార వ్యూహాలు, ఎగుమతి విధానాలపై సమగ్ర సమాచారం రాబట్టడానికి రిక్రూట్ అయ్యారని అమెరికా ఇంటెలిజెన్స్ అనుమానిస్తుంది. వివాహేతర సంబంధం బయటపడటంతో జెన్సన్ హువాంగ్ తన కుటుంబానికి, కంపెనీ బోర్డుకి, ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా క్షమాపణలు చెప్పారు. నేను నా భార్యకు ద్రోహం చేశాను. నా చర్యలు ఆమెను, మా పిల్లలను తీవ్రంగా బాధించాయి. నేను చేసిన దానికి ఎలాంటి సాకు లేదు, నేను చాలా చింతిస్తున్నాను. నా జీవితాంతం నా కుటుంబం నాకు మద్దతుగా నిలిచింది, కానీ నేను వారి నమ్మకాన్ని దెబ్బతీశాను. ఎన్వీడీయాకు నాయకత్వం వహించడం నా జీవితంలో లభించిన గొప్ప బాధ్యత. నేను ఆ స్థానానికి, మీ నమ్మకానికి అర్హుడిగా ఉండటంలో విఫలమయ్యాను. మళ్లీ అందరి విశ్వాసాన్ని పొందేందుకు కృషి చేస్తాను" అని హువాంగ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జెన్సన్ హువాంగ్ ను "మంచి వ్యక్తి" అన్నారు. హువాంగ్ దేశం కోసం, టెక్ రంగానికి అద్భుతమైన కృషి చేశారని కొనియాడారు. అయితే, ఈ అంశంపై తాను హువాంగ్‌తో వ్యక్తిగతంగా మాట్లాడలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ కథనాలు అంతర్జాతీయంగా కలకలం రేపడంతో, ఎన్వీడీయా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు దీనిపై స్వతంత్ర దర్యాప్తునకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. జాతీయ భద్రతకు గానీ, ఎన్వీడీయా గోప్యత, కంపెనీ డేటాకు గానీ ఎలాంటి నష్టం జరగలేదని, మీడియా రిపోర్టునలు నమ్మడానికి సరైన కారణాలు లేవని బోర్డు పేర్కొంది. బోర్డు స్వతంత్ర విచారణకు జెన్సన్ హువాంగ్ పూర్తిగా సహకరిస్తున్నారని, అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను, నివేదికలను కమిటీ సమగ్రంగా సమీక్షిస్తుందని ప్రకటించింది. ఈ క్రమంలో అమెరికా-చైనా టెక్నాలజీ పోటీపై ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు జెన్సన్ హువాంగ్ రాజీనామా చేయడంతో.. ప్రపంచ ఏఐ దిగ్గజం ఎన్విడియా తదుపరి శాశ్వత సీఈఓ కోసం వేట ప్రారంభించింది. ప్రస్తుతానికి కోలెట్ క్రెస్ తాత్కాలిక సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. ఈ కీలక పదవి రేసులో ఏకంగా 11 మంది ప్రముఖ టెక్ నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో ముగ్గురు భారత సంతతి నిపుణులతో పాటు యాపిల్ మాజీ సీఈఓ టిమ్ కుక్, ఏఎండీ అధినేత్రి లిసా సు వంటి దిగ్గజాలు ఉండటం విశేషం. మెమోరీ చిప్ తయారీ సంస్థ మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా.. నాలుగు దశాబ్దాల అనుభవంతో ముందంజలో ఉన్నారు. ఎన్విడియాతో కలిసి పని చేసిన అనుభవం, శాన్‌డిస్క్ సహ వ్యవస్థాపకుడిగా ఆయనకున్న ట్రాక్ రికార్డు ఇందుకు కలిసొచ్చే అంశం. అలాగే పాలో ఆల్టో నెట్‌వర్క్స్ సీఈఓ నికేష్ అరోరా, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో వీరికి అపార అనుభవం ఉన్నప్పటికీ.. నేరుగా చిప్ డిజైన్ రంగంలో అనుభవం లేకపోవడం వీరికి కాస్త ప్రతికూలంగా మారవచ్చు. ఎన్విడియా అంతర్గత అభ్యర్థుల విషయానికి వస్తే.. తాత్కాలిక సీఈఓ కోలెట్ క్రెస్‌కు వాల్ స్ట్రీట్ వర్గాల్లో మంచి పట్టు ఉంది. కంపెనీ ఆర్థిక వ్యవహారాలను దశాబ్ద కాలంగా నడిపిస్తున్న ఆమె పేరు కూడా రేసులో ఉంది. ఇక ఎన్విడియాను గేమింగ్ చిప్ స్థాయి నుంచి ఏఐ దిగ్గజంగా మార్చిన 'కూడా' సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఇయాన్ బక్ మరో ప్రధాన పోటీదారుగా ఉన్నారు. మరోవైపు గతంలో ఎన్విడియాలో పని చేసి ప్రస్తుతం ఆర్మ హోల్డింగ్స్ సీఈఓగా ఉన్న రెనే హాస్, ఇంటెల్ మాజీ సీఈఓ పాట్ గెల్సింగర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. బయటి కంపెనీల దిగ్గజాలలో యాపిల్ మాజీ సీఈఓ టిమ్ కుక్ పేరు సంచలనంగా మారింది. స్టీవ్ జాబ్స్ తర్వాత యాపిల్‌ను 4.5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లిన కుక్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి ఛాయిస్‌గా తెలుస్తోంది. యాపిల్ హార్డ్‌వేర్ చీఫ్ జానీ స్రోజీ, మార్వెల్ టెక్నాలజీ సీఈఓ మాట్ మర్ఫీ కూడా పోటీలో ఉన్నారు. వీరందరికంటే ఆసక్తికరమైన పేరు ఎన్విడియా ప్రధాన ప్రత్యర్థి ఏఎండీ సీఈఓ లిసా సు. తైవాన్‌లో జన్మించి హువాంగ్‌కు దూరపు బంధువైన లిసా సు.. చైనా మార్కెట్‌లోనూ పట్టు సాధించారు. ఒకవేళ ఆమె ఎన్విడియా పగ్గాలు చేపడితే టెక్ ప్రపంచంలో పెను సంచలనమే అవుతుంది. ఈ 11 మందిలో ఎన్విడియా బోర్డు ఎవరికి పట్టం కడుతుందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా జెన్సన్ హువాంగ్ ప్రవర్తనపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిపై కూలంకుషంగా దర్యాప్తు జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని నిపుణులు కోరుకుంటున్నారు.

అవినీతి జలగా మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్

మొదటిపేజీ తరువాయి..

చర ఆస్తులు, పెట్టుబడులు కలిపి మొత్తం రూ.6,76,45,738 విలువైన ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ ప్రాథమికంగా అంచనా వేసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో గుండు వాణి టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. ఆమె విధుల్లో అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా ఆస్తులు సంపాదించినట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు. అవినీతి నిరోధక చట్టం, 1988లోని సవరణల అనంతరం



అమల్లో ఉన్న సెక్షన్ 13(1)(ఎ)తో పాటు 13(2) కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నవంబర్ 16న ఆమె నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, సన్నిహితులు, బినామీలకు సంబంధించిన ప్రాంతాలు సహా మొత్తం ఎనిమిది చోట్ల ప్రాథమిక సోదాలు చేపట్టారు. సోదాల్లో పలు స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు లభించినట్లు ఏసీబీ వెల్లడించింది. వాటిలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 283.11 చదరపు గజాల విస్తీర్ణంలో ఒక ఖాళీ స్థలం, జనగామ జిల్లా పాలకుర్తిలో 424 చదరపు గజాల మరో ఖాళీ స్థలం ఉన్నాయి. ఈ రెండు స్థలాల మొత్తం విలువ రూ.87.67 లక్షలుగా అంచనా వేశారు. రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లో రూ.63 లక్షల విలువైన ఒక నివాస ఫ్లాట్‌ను గుర్తించారు. అదే ప్రాంతంలో రెండు అంతస్తులపైన మరో అంతస్తు కలిగిన (జీ+2) నివాస భవనం కూడా ఉన్నట్లు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.2.45 కోట్లుగా పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలో ఒక ఎకరం 10 గుంటల విస్తీర్ణంలో వ్యవసాయ భూములు ఉన్నట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.29.70 లక్షలుగా అంచనా వేశారు. గుండు వాణిపై గతంలోనూ ఏసీబీ కేసు నమోదైంది. 2026 సెప్టెంబర్ 30న క్రైమ్ నంబర్ 29/=జు-జ=2/2026 కింద అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7(ఖ) ప్రకారం కేసు నమోదు చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో రూ.75 వేల లంచం డిమాండ్ చేసి, స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆమెను హైదరాబాద్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట పీటీ వారెంట్‌పై హాజరుపరచనున్నట్లు ఏసీబీ తెలిపింది. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. వాట్సాప్ ద్వారా 9440446106 నంబర్‌కు, ఫేస్‌బుక్‌లో తెలంగాణ ఏసీబీ పేజీ ద్వారా, ఎక్స్‌లో ఏపవర్‌శ్రీఅస్త్రుఱుఖ ూజదీ ఖాతా ద్వారా కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన బహిరంగ ప్రదేశాల్లో ఏసీబీ క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి పేరు, వివరాలను రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి అక్వాన్ తుపాను ముప్పు

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. నవంబర్ 21వ తేదీన తుపాను ప్రభావం గరిష్ఠ స్థాయికి చేరవచ్చని.. కొన్ని ప్రాంతాల్లో 150 నుంచి 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వేగంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపానుకు ఇరాన్ సూచించిన 'అక్వాన్' అనే పేరు పెట్టారు. ఆదివారం సాయంత్రం నాటికి ఈ వ్యవస్థ విశాఖపట్నానికి దక్షిణ-ఆగ్నేయంగా సుమారు 920 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. ఇది వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 16వ తేదీ నాటికి తుపానుగా.. నవంబర్ 17వ తేదీ నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తొలుత అంచనా వేసింది. ఆ తర్వాత మరింత బలపడి నవంబర్ 19వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారవచ్చని పేర్కొంది. తుపాను సమయంలో గంటకు 120 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. గరిష్ఠ వేగం గంటకు 145 కిలోమీటర్ల వరకు చేరవచ్చని తెలిపింది. ప్రస్తుత వాతావరణ నమూనాల ప్రకారం.. అక్వాన్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశాలు కనిపిస్తున్నాయి. నవంబర్ 20వ తేదీన నెల్లూరు నుంచి తుని మధ్య, ముఖ్యంగా కావలి నుంచి కోనసీమ ప్రాంతాల మధ్య ఒంగోలు లేదా బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే తుపాను తీరం దాటే ప్రాంతం, తీవ్రతపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

తుపాను ప్రభావంతో కోస్తాంధ్రలో నవంబర్ 18వ తేదీ నుంచే వర్షాలు ప్రారంభమై.. 19, 20వ తేదీల్లో తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అక్వాన్ తుపాను ఈనెల 20 నుంచి 22 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాలపై తుపాను ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 150 నుంచి 200 మిల్లీమీటర్లకు మించి వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నవంబర్ 21వ తేదీన వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ విశ్లేషకులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఈ 2 రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని అంచనా వేస్తున్నారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అయితే పశ్చిమ తెలంగాణ జిల్లాలపై తుపాను ప్రభావం తక్కువగా ఉండవచ్చని వాతావరణ విశ్లేషకులు చెబుతున్నారు. అక్కడ తేలికపాటి వర్షాలు లేదా పొడి వాతావరణం కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

ఎన్నో అవాస్తవిక కథనాలు

మొదటిపేజీ తరువాయి..

అనేక కల్పిత కథలు అల్లుతున్నారని, అసత్యాలను ప్రచారం చేస్తూ బాధించే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తన భావాలను, తన కుటుంబం గురించి తనకు తెలిసిన వాస్తవాలను పుస్తకం రూపంలో ప్రజల ముందుకు తెచ్చినట్లు తెలిపారు. తన పుస్తకానికి బిలాంగింగ్ అనే పేరు పెట్టడానికి గల కారణాన్ని కూడా ఆమె వివరించారు. ఒక కొత్త వ్యక్తిగా మరో సమాజంలోకి వెళ్లినప్పుడు అక్కడి వారిలా తాను లేననే భావన కలుగుతుందని.. ఎప్పుడూ ఇతరులు తమను గమనిస్తున్నారనే ఆలోచన, తాము ఏదైనా తప్పు చేస్తున్నామేమోననే సందేహం ఉంటాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఇతరుల అంగీకారం పొందేందుకు చేసే ప్రయత్నం, చివరకు ఆ సమాజంలో ఒకరిగా గుర్తింపు పొందడమే బిలాంగింగ్ అనే పేరుకు అర్థమని వివరించారు.పెళ్లి తర్వాత అల్లరింట్లోకి అడుగుపెట్టిన మహిళలు ఎదుర్కొనే పరిస్థితులతో తన అనుభవాలను పోల్చారు సోనియా గాంధీ. భారతదేశంలో ఎంతోమంది అమ్మాయిలు పెళ్లి తర్వాత అత్తవారింటికి వెళ్లి అక్కడి పద్ధతులు, సంప్రదాయాలకు అనుగుణంగా మారాల్సి వస్తుందని.. తన విషయంలో ఇది మరింత కష్టంగా అనిపించిందన్నారు. ఎందుకంటే తాను పూర్తిగా భిన్నమైన సామాజిక, సాంస్కృతిక వాతావరణం నుంచి వచ్చానని తెలిపారు. అయితే భారతీయ అమ్మాయిలకు కూడా ఇది అంత సులభం కాదని.. కొత్త ఫ్యామిలీలో వారు అందరికీ నచ్చాలి అంటే ఎంతో కష్టపడాలన్నారు. అందుకే తన పుస్తకానికి బిలాంగింగ్ అనే పేరు పెట్టినట్లు వివరించారు.తన పుస్తకానికి పాఠకుల నుంచి లభిస్తున్న ఆదరణపై సోనియా గాంధీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు తనను భావోద్వేగానికి గురిచేశాయని తెలిపారు. పుస్తకంపై వచ్చిన విమర్శల్లో కొన్ని చాలా కఠినంగా ఉన్నాయని, మరికొన్ని మాత్రం నిజాయితీతో కూడుకున్నవని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన భర్త, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమానుబంధాన్ని కూడా సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. కేంబ్రిడ్జ్‌లో ఒక స్నేహితుడి ద్వారా రాజీవ్ గాంధీతో తనకు పరిచయం ఏర్పడిందని తెలిపారు. తమది ఓ అద్భుతమైన ప్రేమకథ అని అభివర్ణించారు. అయితే తన తండ్రి చాలా కఠినంగా ఉండేవారని, తమ వివాహం సజావుగా సాగకపోతే తిరిగి పచ్చేందుకు వీలుగా తనకు రిటర్న్ టికెట్ కూడా ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. అయితే తాను తిరిగి వెళ్లలేదని వ్యాఖ్యానించారు.న్యూఢిల్లీలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తమిళనాడు సీఎం విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఇక తన పుస్తకానికి పాఠకుల నుంచి వస్తున్న ఆదరణ, ప్రేమ పట్ల సోనియా గాంధీ ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలు తననెంతో కదిలించాయని అన్నారు. ప్రజలు పుస్తకాన్ని కొనుగోలు చేయడం, దానిపై కామెంట్లు చేయడం ద్వారా చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ సందర్భంగా పుస్తకంపై వస్తున్న విమర్శల గురించి ప్రస్తావిస్తూ కొన్ని విమర్శలు కాస్త కఠినంగా ఉన్నప్పటికీ, మరికొన్ని నిజాయతీగా ఉన్నాయని, తామేం చెప్పాలో, ఏం చెప్పకూడదో వారు స్పష్టంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ తన తల్లి సోనియా గాంధీ గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నారు. తన తల్లి ఏనాడూ భయపడడం తాను చూడలేదని అన్నారు. "నాన్న చనిపోకముందు అమ్మ ఎలా ఉండేదో అనేది ఈ పుస్తకం మీకు తెలియజేస్తుంది. ఆమె నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారు. ఈ విషయాన్ని ఆమె చాలా తేలికగా చెప్పారు. అయితే మా అమ్మ భయపడటం నేనెప్పుడూ చూడలేదు. ఏ పరిస్థితిలోనూ ఆమె వెనకడుగు వేయడం నేను చూడలేదు. అమ్మ.. నాన్న నిన్ను ఎంతగానో ప్రేమించేవారు. ఇప్పుడు నిన్ను చూస్తే ఆయన ఎంత గర్వపడేవారో మాటల్లో చెప్పలేను" అని రాహుల్ గాంధీ అన్నారు.

పాత పెన్షన్ కోసం ఉద్యోగుల పోరు..

2.15 లక్షల మంది ఉద్యోగుల ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా నేడు సామూహిక సెలవు..

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి):

తెలంగాణలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 17వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా సామూహిక సెలవు పాటించాలని నిర్ణయించాయి. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో ప్రకటించి 3 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ ఈయూ) వెల్లడించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్మదీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.6 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు ఉండగా.. వారిలో 45 వేల మంది అత్యవసర సేవల విభాగాల్లో పనిచేస్తున్నారని యూనియన్ తెలిపింది. మిగిలిన ఉద్యోగుల్లో ఇప్పటికే 1.5 లక్షల మందికిపైగా సామూహిక సెలవు కోసం దరఖాస్తులు సమర్పించారని పేర్కొంది. మొత్తం 2.15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ నిరసనలో పాల్గొనే అవకాశం ఉందని వెల్లడించింది. ఉద్యోగుల ఉద్యమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మద్దతు ప్రకటించారు. ఈ నెల 17వ తేదీన నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్మదీక్షలో పాల్గొంటానని తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది. మరోవైపు.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించే అంశంపై తక్షణమే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం జరిగిన జేఏసీ అత్యవసర సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. గతంలో సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్పు అంశంపై ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చలు జరిపిందని జేఏసీ నేతలు గుర్తుచేశారు. ఈ అంశంపై అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని తెలిపారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ మొత్తం 42 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. వీటిలో ప్రధానంగా రెండో వేతన సవరణ సంఘం సిఫార్సులను 2023 జూలై 1వ తేదీ నుంచి అమలు చేయాలని కోరింది. అలాగే 2004 సెప్టెంబర్ 1వ తేదీ కంటే ముందు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మూడు నెలల్లో చెల్లించాలని.. గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని కనీసం రూ.20 లక్షలకు పెంచాలని కోరింది. పట్టణ ప్రాంతాల్లో ఇంటి అద్దె భత్యాన్ని (హెచ్ఆర్ఏ) 35 శాతానికి, జిల్లా కేంద్రాల్లో 30 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించింది. విద్యాశాఖలో ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేసి పదోన్నతుల అవకాశాలు కల్పించాలని జేఏసీ కోరింది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధానాన్ని అమలు చేయాలని, అందుకు అనుగుణంగా సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను సవరించాలని పేర్కొంది. మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 హెడ్ ఆఫ్ అకౌంట్ కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం, అర్హులైన ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సేవలను క్రమబద్ధీకరించడం, జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నాలుగేళ్ల నిరంతర సేవ ఆధారంగా సోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించడం వంటి అంశాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.

దివ్యాంగ ఉద్యోగులకు పదోన్నతుల్లో ప్రస్తుతం ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచాలని జేఏసీ కోరింది. బదిలీల్లో ప్రాధాన్యత కల్పించేందుకు వైకల్య శాతానికి సంబంధించిన అర్హత పరిమితిని 70 శాతం నుంచి 40 శాతానికి తగ్గించాలని సూచించింది. వేసవి సెలవులు, ఇతర సెలవుల సమయంలోనూ కన్వేయన్స్ అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేసింది. ఇక రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది సేవలను కొనసాగించాలని, గ్రామ పాలన అధికారులకు కార్యాలయ భవనాలు నిర్మించాలని, అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరింది. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు శిక్షణ, పదోన్నతులు, కొత్త వైద్య కళాశాలల్లో అవసరమైన పోస్టుల మంజూరు వంటి అంశాలను కూడా ప్రస్తావించింది.

వాయిస్ శాంపిల్స్ ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి..

పాడి కౌశిక్‌రెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో పోలీసుల దర్యాప్తులో భాగంగా కౌశిక్‌రెడ్డి వాయిస్ శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. కరీంనగర్ సీపీని దూషించినట్లు వచ్చిన ఆరోపణలపై పాడి కౌశిక్‌రెడ్డిపై వీణవంక పోలీస్ స్టేషన్‌లో గతంలో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా ఆయన వాయిస్ శాంపిల్ సేకరించాలని పోలీసులు నిర్ణయించారు. ఇందుకోసం కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. అయితే వీణవంక పోలీసులు ఇచ్చిన నోటీసులను పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. తాను సీపీని దూషించలేదని.. ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేసి తనపై కేసు నమోదు చేశారని తన పిటిషన్‌లో పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. కౌశిక్‌రెడ్డి పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ తన వాదనలు వినిపించారు. కేసు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తాం

ఎల్కతుర్తిలో కొత్తగా 715 మందికి చేయూత

పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్

హన్మకొండ జిల్లా ప్రతినిధి,
నవంబరు 16, (ప్రజాజ్యోతి):
అర్హులైన పేదలందరికీ సామాజిక భద్రత కల్పించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం లోని ఎల్కతుర్తి మండలంలో సోమవారం నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో నూతన పింఛన్ల లబ్ధిదారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎల్కతుర్తి మండలంలో ఇప్పటికే 5,850 మందికి నెలవారీ పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 715 మందికి మంజూరు చేసినట్లు వెల్లడించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 5,230 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని, రాష్ట్రవ్యాప్తంగా 4,63,857 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు వివరించారు. వీరిలో 2,77,894 మంది వితంతువులు, 1,00,224 మంది దివ్యాంగులు, 27,444 మంది గీత కార్మికులు, 4,451 మంది చేనేత కార్మికులు, 53,844 మంది ఒంటరి మహిళలు ఉన్నారని తెలిపారు. పింఛన్ల పరిశీలనలో లోపాలు ఉంటే ప్రత్యేక అధికారులతో క్షుణ్ణంగా తనిఖీ చేయిస్తామని, అర్హులైన ఏ ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకుండా చూస్తామని స్పష్టం చేశారు.

ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి అక్కాచెల్లెళ్లను ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చిలకపచ్చ రంగు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని 18 ఏళ్లు నిండిన కోటి మంది మహిళలకు చీరలు అందించనున్నట్లు వెల్లడించారు. రైతులకే పరిమిత మైన బీమా సౌకర్యాన్ని అన్ని వృత్తుల వారికి వర్తింప జేసేలా ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత పదేళ్ల అప్పుల భారం ఉన్నప్పటికీ పాత సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ కొత్త పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పెంపునకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలు, పొలాల్లో ఫామ్ పాండ్స్, గ్రామాల్లో ఊటకుంటలు నిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు. జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.





యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని, గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. చిన్న గ్రామాలకు రూ.లక్ష, పెద్ద గ్రామాలకు రూ.2 లక్షల చొప్పున క్రీడాభివృద్ధి నిధులు అందిస్తున్నామన్నారు. ఎల్కతుర్తి చౌరస్తా అభివృద్ధి చేశామని, త్వరలో నూతన బస్టాండ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎల్కతుర్తి ఆసుపత్రి విస్తరణ, మణికొండ రహదారి నిర్మాణం చేపడతామన్నారు. పేదరికం నుంచి బయటపడి ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యే ప్రధాన మార్గమని, తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాల లక్ష్యం:

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికులు, తలసేమియా బాధితులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేసి పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విడతలో దాదాపు 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇచ్చామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తామని చెప్పారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న మరో 13 వేల మంది వివరాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, తలసేమియా బాధితులైన పురుష పింఛనుదారులు మరణిస్తే వారి భార్యలకు ఒకటి రెండు నెలల్లోనే పింఛన్ మంజూరయ్యేలా కొత్త జీవో తీసుకొచ్చినట్లు తెలిపారు.

మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు అందించాలనే లక్ష్యంతో ఇప్పటివరకు రూ.75 వేల కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. ఎలాంటి తాకట్టు లేకుండా రుణాలు అందిస్తున్నామని, వడ్డీ మొత్తాన్ని ప్రతి మూడు నుంచి ఆరు నెలలకోసారి సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కిరాణా, వస్త్ర దుకాణాలు, మొబైల్ వాహనాల ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించగా, గత ఏడాది రూ.168 కోట్ల కమీషన్ ఆదాయం సమకూరిందన్నారు. మేడారం జాతరలో మహిళలు రూ.3 కోట్ల రుణాలతో వ్యాపారాలు నిర్వహించి రూ.6 కోట్ల వరకు ఆదాయం ఆర్జించారని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల కోసం హైటెక్‌సిటీ సమీపంలో రూ.1,000 కోట్ల విలువైన 106 దుకాణాలను కేటాయించినట్లు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులకు బీమా, రుణమాఫీ సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పథకాలను కుటుంబంలోని మహిళల పేర్లపై అందిస్తున్నామని తెలిపారు. 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ద్వారా 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు అక్షరజ్ఞానం అందించామని, ఆసక్తి ఉన్నవారికి పదో తరగతి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు, ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు మంత్రులు వివరించారు.

చింతాబాబు మాదిగకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు

న్యూఢిల్లీలో జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పురస్కార ప్రదానం

కోదాడ వాసి చింతాబాబు మాదిగకు అరుదైన గౌరవం

న్యూఢిల్లీలో 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు' ప్రదానం

కోదాడ టౌన్ ,నవంబర్ 16 (ప్రజా జ్యోతి):
కోదాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ దళిత ఉద్యమకారుడు చింతాబాబు మాదిగ ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు'ను అందుకున్నారు.



సోమవారం న్యూఢిల్లీలోని కరోల్ బాగ్ కళామందిరంలో జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నేషనల్ అవార్డు గ్రహీతల సత్కార సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కరోల్ బాగ్ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే, నేషనల్ లీగల్ అడ్వైజర్ సుధారాణి మరియు జాతీయ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణలు కలిసి చింతాబాబు మాదిగకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చింతాబాబు మాదిగ మాట్లాడుతూ 1990 నుండి నేటి వరకు సుదీర్ఘంగా 35 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కొనసాగుతూ జాతికి సేవ చేస్తున్నానని తెలిపారు. మార్గదర్శి యూత్ స్ఫూర్తి, స్వచ్ఛంద దళిత ఉద్యమ కార్యక్రమాలలో తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఈ అవార్డు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 'దళిత రత్న మాదిగ' బిరుదును అందుకున్నానని, నేడు జాతీయ స్థాయిలో అంబేద్కర్ అవార్డు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ అవార్డు అందించిన అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణకు, తనకు నిరంతరం సహకరిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగలకు మరియు తన సొంత ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా వన సమారాధనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి
సామాజికంగా,రాజకీయంగా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మున్నూరు కాపు కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా



మున్నూరు కాపు సంక్షేమ సంఘం మనుగడ సాగిస్తోందని, ఇందుకు కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా అని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ పేర్కొన్నారు.సంక్షేమ సంఘం,కాపు జేఏసీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు వన సమారాధనకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.రానున్న రోజుల్లో సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో ప్రకటించారు.ఈక్రమంలో కాపుల ఐక్యత దిశగా కలిసి వచ్చే సానుకూల శక్తులను కలుపుకుని ముందుకు సాగాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.జిల్లాలో కాపు కులస్తులకు ఎలాంటి ఆపద వచ్చినా రాజకీయాలకు,వర్గాలకు అతీతంగా ఆదుకోవడానికి,వెన్నుదన్నుగా నిలవడానికి సంక్షేమ సంఘం అనునిత్యం పని చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ దిశగా సభ్యత్వ నమోదు ప్రక్రియ, అన్ని నియోజకవర్గ స్థాయిల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.కాపు కార్తీక వన సమారాధనకు అతిథులుగా విచ్చేసి విజయవంతం చేసిన ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, కాపు జేఏసీ చైర్మన్ చందు జనార్దన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.అలాగే జిల్లాకి చెందిన కాపు నేతలు లక్కినేని రఘు, బచ్చు విజయ్ కుమార్,లక్కినేని సుధీర్, ఆకుల మూర్తి, పిన్ని కోటేశ్వరరావు, తోట కనకరాపు,గుండా బ్రహ్మం,కనకం భద్రయ్య,ఎర్ర జ్ఞానేశ్, మాటేటి కిరణ్,ముగాల శ్రీను,పసుపులేటి శ్రీనివాసరావు , కోయాలా వీరన్న , సత్యనారాయణ జేఏసీ నాయకులు బచ్చు మధు,మదూరి సైదారావు,రాపర్తి రాజా, నరాల నరేష్, మాటేటి రవి తదితరుల కృషిని మరువలేనని కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 16(ప్రజాజ్యోతి): తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు (ఎస్ఎస్సీ 2027) రాయబోయే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ కీలక సమాచారం అందించింది. పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పొడిగిస్తూ, సవరించిన నూతన షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఫీజు చెల్లింపు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం.. ఎలాంటి ఆలస్య రుసుము (లేట్ ఫీజు) లేకుండా నవంబర్ 26 వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 8 వరకు అవకాశం కల్పించారు. రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 నుంచి డిసెంబర్ 21 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు ఫీజు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. రెగ్యులర్ విద్యార్థులు మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాసేందుకు రూ.125 ఫీజుగా నిర్ణయించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు

భారీ ఊరట



మొదటిపేజీ తరువాయి..

ఈ నిర్ణయంతో ప్రయోజనం కలగనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది లబ్ధిదారులకు ఊరట లభించనుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇళ్ల పథకాల కింద రుణాల మంజూరు సమయంలో లబ్ధిదారుల ఒరిజినల్ పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను గృహ నిర్మాణ సంస్థ అధికారులు తనఖా కింద తీసుకున్నారు.

అయితే రుణాల ప్రక్రియ పూర్తి అయినా.. చాలా ప్రాంతాల్లో ఆ పత్రాలు లబ్ధిదారులకు తిరిగి అందలేదు. దీంతో ఏళ్ల తరబడి వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను సంబంధిత లబ్ధిదారులకు తిరిగి అందజేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల 22ఏ భూములపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ సమస్య సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వెళ్లినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఒరిజినల్ పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు చేతిలో లేకపోవడంతో లబ్ధిదారులు తమ ఇళ్లకు సంబంధించిన పలు పనుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆస్తి లావాదేవీలు, బ్యాంకు రుణాలు, వారసత్వ బదలాయింపుల సమయంలో పత్రాల కొరత సమస్యగా మారుతోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వాటిని తిరిగి అందించాలని నిర్ణయించడంతో ఈ ఇబ్బందులు తగ్గనున్నాయి. అయితే పత్రాల వాపసు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా ఆస్తులపై లబ్ధిదారుల హక్కులు, లావాదేవీలకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయి. గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పత్రాలను తిరిగి అందించాల్సి ఉంటుంది. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న పత్రాలను సంబంధిత వ్యక్తులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ నిర్ణయంతో ఏళ్లుగా పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లక్షలాది కుటుంబాలకు ఊరట లభించనుంది.

కార్తీక తొలి సోమవారం వైభవం..

మొదటిపేజీ తరువాయి..

శివనామస్మరణతో మార్మోగాయి.ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం తొలి సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లో బారులు తీరారు. అభిషేకాలు నిర్వహించి స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులను చెల్లించుకున్నారు. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివాలయంలో కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. శివాలయంలో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోనూ శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. లంగర్‌హౌస్‌లోని ప్రసిద్ధ మీసాల రామయ్య దేవాలయంలో శివలింగ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.భద్రాచలంలోని పవిత్ర గోదావరి నది వద్ద భక్తుల రద్దీ పెరిగింది. తెల్లవారుజాము నుంచే నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గోదారి కార్తిక దీపాలను వదులుతూ



పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి కదిలి వచ్చిన మహిళలు ఛత్ పూజ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నది వద్ద పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో 365 వత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో గోదావరి నది పరివాహక ప్రాంతం సందడిగా మారింది. ఎన్‌ఎన్‌పీ క్యాంప్ శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో రద్దీగా మారింది. స్వామి అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.వరంగల్ జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి జలాభిషేకాలు చేస్తూ పుష్పాలతో అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. హర హర మహాదేవ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో శ్రీ ఓంకారేశ్వర ఆలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృత అభిషేకాలతో పాటు, బిల్వ పూజ, వివిధ రకాల పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. భక్తుల దీపారాధనలతో ఆలయ ప్రాంగణమంతా కాంతులీనింది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ విస్తరణ



మొదటిపేజీ తరువాయి..

ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్‌లో అందుబాటులోకి తెచ్చిన ఏఐ ల్యాబ్ సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ కొత్త ఒప్పందంతో గతంలో టీ-ఫైబర్‌కు ఎదుర్కొన్న నిధుల కొరత సమస్య పరిష్కారమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకాన్ని ప్రారంభించింది. టీ ఫైబర్ ద్వారా గ్రామాల్లో డక్ట్ వైర్ ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 1,179 గ్రామ పంచాయతీలు, 482 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా టీ ఫైబర్ కనెక్షన్లను విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3,185 కోట్ల నిధులను కేటాయించడానికి ఆమోదం తెలపడంతో సేవల విస్తరణకు అడ్డుగా ఉన్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి.ఇంటర్నెట్ కనెక్షన్ అవసరమైన రూటర్స్, కేబుళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులకు సరసమైన ధరకే హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుతాయి. ఇళ్లలో కంప్యూటర్లు, టెలివిజన్ల కోసం 4జీ, 5జీ నెట్‌వర్క్ సౌకర్యం లభిస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఫైబర్ పైపులు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల సేవలు పరిమితంగా లేదా సరిగ్గా అందడం లేదు. ఇప్పుడు తీసుకున్న ఈ కొత్త చర్యల ద్వారా సేవల్లో మెరుగైన మార్పులు రానున్నాయి.

వరల్డ్ టాప్-200 వర్సిటీల్లో ఐఐటీ దిల్లీ

మొదటిపేజీ తరువాయి..

జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం మళ్లీ వరల్డ్ టాప్- 500 జాబితాలోకి ప్రవేశించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ భారతదేశంలో రెండో ర్యాంకు సాధించగా, ప్రపంచవ్యాప్తంగా 224వ స్థానంలో నిలిచింది. దిల్లీ యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా 237వ స్థానంలో నిలిచింది. భారత్‌లో మూడో ఉత్తమ విద్యా సంస్థగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పర్యావరణ, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో, సుస్థిర భవిష్యత్తును నిర్మించడంలో ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయో ఈ సస్టైనబులిటీ ర్యాంకింగ్స్ ద్వారా ప్రకటిస్తారు. ఈ ఏడాది క్యూఎస్ (క్వాక్వారెల్లీ సైమండ్స్) సస్టైనబులిటీ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి మొత్తం 99 విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకున్నాయి. అయితే గతేడాది ఉన్న 103 ఎంట్రీలతో పోలిస్తే ఈ సంఖ్య తగ్గిందని చెప్పొచ్చు. ఇక ఈ ఏడాది ర్యాంకింగ్స్‌లో అత్యధిక ప్రాతినిధ్యం ఉన్న మొదటి ఐదు ఉన్నత విద్యా వ్యవస్థలలో ఎక్కువ పురోగతి కనబరిచిన దేశంగా భారత్ నిలిచింది. ర్యాంకింగ్స్‌లో అత్యధికంగా అమెరికా నుంచి 214 యూనివర్సిటీలు ఎంట్రీ సాధించగా, చైనా నుంచి 149, యూకే నుంచి 105 విద్యాసంస్థలు చోటు దక్కించుకున్నాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా టాప్ - 1000 యూనివర్సిటీల జాబితాలో భారత్ నుంచి 42 విద్యా సంస్థలు ఉన్నాయి. ఇక్కడ భారత్, చైనాతో కలిసి సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచింది. అమెరికా (128), బ్రిటన్ (84) మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. భారతదేశం నుంచి ఈసారి క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ జాబితాలో 8 కొత్త విద్యా సంస్థలు ప్రవేశించాయి. ఇంకా కిందటేదాది ర్యాంకులు పొందిన వాటిల్లో 38 సంస్థలు తమ ర్యాంకుల్ని మరింత మెరుగుపర్చుకున్నాయి. 19 సంస్థల ర్యాంకింగ్స్ యథాతథంగా ఉన్నాయి. 34 సంస్థల ర్యాంకులు గతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. 2023 తర్వాత తొలిసారిగా జేఎన్‌యూ తిరిగి ప్రపంచ టాప్- 500 యూనివర్సిటీల జాబితాలోకి ప్రవేశించడం విశేషం. వేలూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎఇ) తొలిసారిగా టాప్- 300 యూనివర్సిటీల జాబితాలోకి, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ టాప్- 400 లిస్టులోకి అడుగుపెట్టాయి. చండీగఢ్ యూనివర్సిటీ, సవీత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ తొలిసారి టాప్- 600 లోకి ప్రవేశించాయి.2023లో తొలిసారి ఈ ర్యాంకింగ్స్ ప్రకటించగా అప్పట్లో కేవలం 5 భారతీయ విద్యా సంస్థలు మాత్రమే టాప్- 500 జాబితాలో ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 9 కి చేరుకుంది. 2025లో 11 చోటు సంపాదించగా, 2026లో మరొకటి పెరిగి ఈ విద్యా సంస్థల సంఖ్య 12 కు చేరింది. ఇప్పుడు 2027 ర్యాంకింగ్స్‌లో మరింత మెరుగుపర్చుకొని 13 సంస్థలు టాప్- 500 జాబితాలో నిలిచాయి. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో భారతీయ విద్యా సంస్థల పురోగతిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. సుస్థిర భవిష్యత్తు దిశగా భారత ఉన్నత విద్యా సంస్థలు సాధిస్తున్న స్థిరమైన ప్రగతికి ఈ ర్యాంకులు నిదర్శనం అని చెప్పారు. 38 సంస్థలు ర్యాంకుల్ని మెరుగుపర్చుకోవడం, 13 సంస్థలు టాప్- 500 లో నిలవడం ప్రోత్సాహకరంగా ఉందన్నారు. ఇ

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967